క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

◆ ఎంఆర్‌ఓ ఆఫీస్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుండి 11 గంటల వరకు, ఆర్‌టీఏ ఆఫీస్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు,ఫరత్‌నగర్, 7టెంపుల్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు, ఎల్‌ఐసీ కాలనీ పరిధిలో సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

◆ అలాగే, వహీద్‌కాలనీ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎస్ ఆర్‌టీ కాలనీ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, - జవహర్‌పురా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు గణేష్ ఆలయంలో ప్రత్యేక పూజలు

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీఓస్‌కాలనీలోని గణేష్ ఆలయంలో ఈ నెల 14న మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి సోమయాజులు తెలిపారు. పూజల్లో భాగంగా ఉదయం 7 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం, ఉదయం 10 గంటలకు చండీ హోమం జరుగుతాయన్నారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం



సహారాస్టేట్స్ కాలనీలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: సామ రంగారెడ్డి ఫౌండేషన్, సహారా సీనియర్ సిటిజన్ ఫోరమ్ సంయుక్త ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ సహారా స్టేట్స్‌కాలనీలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, సమీప కాలనీలవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫోరమ్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, విశ్వనాథ్, శ్యాం, గంగదాజు కృష్ణారెడ్డి, వెంకటాద్రి, ఓపీ సింగ్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మూసీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చైతన్యపురి: మూసీనదిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని చైతన్యపురి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. ఫణిగిరి కాలనీలోని నర్సింహస్వామి గుట్ట సమీపంలో మూసీ నది మధ్యలో ఓ మృతదేహం ఉండగా స్థానికులు గుర్తించి శనివారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. వీలు కాకపోవటంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రప్పించి రాత్రి 8 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 45–50 సంవత్సరాల మధ్య ఉంటుందని, తెల్ల గడ్డం ఉందని, ఒంటిపై షాట్, బనియన్ మాత్రమే ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిందని, నాలుగు రోజుల క్రితమే నదిలో పడి ఉండవచ్చన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక రుద్రాభిషేకం



హయత్‌నగర్: తెలంగాణ వీరశైవ జంగమ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఉమా పార్థివ లింగాలకు 108 జంటలతో సామూహిక శత రుద్రాభిషేకం, వీరభద్ర ఖడ్గమాల వివాహ వేదిక పుస్తకావిష్కరణ శనివారం హయత్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గురుసిద్ధ మణికంఠ శివాచార్య, మహంత్ సిద్ధేశ్వర స్వాములు ముఖ్య అతిథులుగా హాజరై అభిషేకాన్ని నిర్వహించారు. రాష్ట్ర వీరశైవ జంగమ సమాజం గౌరవ అధ్యక్షుడు రుమాళ్ల విశ్వేశ్వరయ్య, అధ్యక్షుడు వీరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జంగమ సమాజ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు.. పట్టించుకొనే వారెవరు?

- ఎక్కడికక్కడ డ్రైనేజీ లీకేజీలు
- కంపుకొడుతున్న రోడ్లు
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన స్థానికులు



మన్సూరాబాద్- ఆటోనగర్ రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ మురుగు

'ఎక్కడ చూసినా ఏమున్నది గర్వకారణం.. డ్రైనేజీ లీకేజీలు, ఏరులై పారుతున్న మురుగు, కంపుకొడుతున్న రోడ్లు' అనే విధంగా తయారైంది మన్సూరాబాద్, ఆర్‌కే పురం డివిజన్ల పరిధిలోని పరిస్థితి. అధికారులకు ఫిర్యాదు చేసినా డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌టీఆర్ నగర్‌లో..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లోని ప్రధాన రోడ్డుపై గత కొన్ని నెలలుగా మురుగునీరు పారుతోంది. ప్రతి రోజూ డ్రైనేజీ పొంగడంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వందలా వాహనదారులు, పాదచారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో పొంగుతున్న డ్రైనేజీ దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మన్సూరాబాద్–ఆటోనగర్ రోడ్డులో...

మన్సూరాబాద్: మన్సూరాబాద్–ఆటోనగర్ రోడ్డు, సహారాస్టేట్స్ కాలనీ వెనుకవైపు ప్రధాన రోడ్డుపై మురుగు ఏరులై పారుతుండటంతో స్థానికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని హిమపురి కాలనీవాసులు కొద్ది రోజుల క్రితం ఆందోళన చేయగా, త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు మండిపడుతున్నారు. డ్రైనేజీ నీటి వల్ల దుర్వాసన వస్తోందని, దోమలు విజృంభిస్తుండటంతో కంటి మీద కునుకు ఉండటం లేదని, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నామని వారు వాపోతున్నారు. పై కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు ట్రంక్‌లైన్ లేకపోవడంతో అది రోడ్లపై పారుతోంది. జలమండలి, సీవరేజీ బోర్డు అధికారులు నిర్లక్ష్యంతోనే మురుగు రోడ్లపై పారుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు తమ హామీని నెరవేర్చాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎన్‌టీఆర్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

శివారు కాలనీలకు మౌలిక సదుపాయాలు



కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తదితరులు

హయత్‌నగర్: నగర శివార్లలో ఉన్న హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన హయత్‌నగర్ డివిజన్‌లోని సూర్యానగర్, మిధానీకాలనీ, డిఫెన్స్ కాలనీ, ఆనంద్‌నగర్, సీతారాంపురం, ఆంధ్రాబ్యాంక్ కాలనీ, సూర్యతేజ కాలనీ, ఆర్టీసీ మజ్దూర్‌కాలనీ, కమర్షియల్ టాక్స్ కాలనీల్లో పర్యటించి ఆయా కాలనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పలు కాలనీలకు తాగు నీరు, డ్రైనేజీ సౌకర్యం కల్పించామని, పలుచోట్ల రోడ్లు నిర్మించామని చెప్పారు. పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. మిధానీ కాలనీలో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. కాలనీల్లో సబ్ రోడ్లను పూర్తి చేస్తామని, వీధిలైట్ల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు గుడాల మల్లేష, భాస్కర్‌సాగర్, కృష్ణారెడ్డి స్కైలాబ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



డాక్టర్లను సత్కరిస్తున్న మధుసూదన్‌గుప్తా, కాలనీప్రతినిధులు

హస్తినాపురం: ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకొని సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని ఆర్యవైశ్య సంఘం హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు నీళ్ల మధుసూదన్‌గుప్తా అన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వినాయకహిల్స్ కాలనీలో కామినేని ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మధుసూదన్‌గుప్తా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు తరలివచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వినాయకహిల్స్ కాలనీ అధ్యక్షుడు శ్రీధర్, కాలనీ ప్రతినిధులు ఊరే మల్లయ్య, బెజ్జాల జగన్నాథం, వెంకటేస్వర్లు, రవీందర్, బచ్చు శ్రీనివాస్, రామన్న, సముద్రాల అంజనేయులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయిస్తోంది

పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలిమ



జైలు వద్ద మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ జీఎస్ కోట నీలిమ

చంచల్‌గూడ: తెలంగాణ సాధనలో కీలకంగా పని చేసిన విద్యార్థులు, నిరుద్యోగులు, అధ్యాపకులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయిస్తున్నదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలిమ ఆరోపించారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న అధ్యాపకుడు అశోక్‌ను ఆమె శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, గ్రూప్–2 పరీక్షలు రాసే విద్యార్థులు చదువుకోవడానికి కొంత సమయం అడిగితే ఇవ్వకపోవడం దారుణమన్నారు. పరీక్షలు వాయిదా వేయమని అడిగినందుకు అధ్యాపకుడిని అరెస్ట్ చేయటం సరికాదన్నారు.

పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పటిష్టతకు, రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కంకణబద్ధులై పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, పార్టీ నాయకులు తలాటి రమేష్, మహిందర్, శివ, అక్బర్, శ్రీశైలం, విజయ్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



లక్డీకాపూల్ : విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం చాలా అవసరమని సైదాబాద్ సీఐ సీహెచ్ మమత అన్నారు. శనివారం గడ్డిఅన్నారంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో కేబినెట్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీఐ మమత మాట్లాడుతూ, స్కూల్ స్థాయి ఎన్నికలు విద్యార్థుల్లో సామాజిక చైతన్యానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆయా విభాగాలకు ఎన్నికైన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సాయి గీత, ఏజీఎం రవీందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ వంశీ, జితేందర్, డీన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

మీర్‌పేట: పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ జయశంకర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ బృందం మీర్‌పేట పోలీసులతో కలిసి దాడి చేశారు. తాత చిరంజీవి, తన్నేరు శ్రీనివాస్, కర్రె సుభాష్, వల్లపు రాజు, ధారావత్ పిగ్గు నాయక్, లోకరాజులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.8350 నగదు, 5 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



బడంగ్‌పేట్: ఇటీవల వెలువడిన ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన బడంగ్‌పేట మాస్టర్‌మైండ్ కళాశాల విద్యార్థులను శనివారం మంత్రి సబితారెడ్డి అభినందించారు. కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకుంటామని మంత్రి అన్నారు. ఎంసెట్, ఐఐటీ, నీట్, జీఎఫ్‌టీఐలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ జగన్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ పాండు, మేనేజ్‌మెంట్ సభ్యులు నాగేంద్ర, లక్ష్మీపతి, నవనీత, శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులు ఉన్నారు.

బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలి

కాచిగూడ: వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ తంగెళ్లపల్లి రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి బీసీల సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశామన్నారు. శనివారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలను గుర్తించి వారికి సీట్లు కేటాయిస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బీసీల మద్దతుతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీసీలను గుర్తించి సీట్లు కేటాయించిన పార్టీలకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల మద్దతు ఉంటుందన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయస్థాయిలో పలు రాజకీయ పార్టీల అధినేతలు, కేంద్రమంత్రులను కలిసి బీసీల సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

బడంగ్‌పేట్: ప్రపంచంలో తల్లిపాలకు మించిన అమృతం మరోకటిలేదని కార్పొరేటర్ భీమిడి స్వప్న అన్నారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్–1లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ స్వప్న హాజరై మాట్లాడారు. శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలను పట్టించాలన్నారు. ముర్రుపాలలో అధిక బలం ఉంటుందని పుట్టిన గంటలోపే పట్టించాలన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను పట్టిస్తే శిశువులు ఆరోగ్యంగా పెరుగుతారని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లల్లో అందచేస్తున్న సరుకులు తల్లులు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణి మహిళలకు శ్రీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞాన కుమారి, అంగన్‌వాడీ టీచర్ రేణుక, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా పెద్దచెరువు ప్రాంతం



పెద్దచెరువు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: పెద్దచెరువు ప్రాంగణాన్ని ఆహ్లాదకర ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డీహెచ్ఏ 3 ఎన్జీఓ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పెద్దచెరువు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నాటిన మొక్కల సంరక్షణకు ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. చెరువు ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఆగస్టు 15న పెద్దచెరువు ప్రాంగణంలో భారీ జాతీయ జెండాను ఆవిష్కరిస్తామని తెలిపారు.

వాణిజ్య ప్రాంతమంటూ అధిక పన్నులు వేస్తున్నారు: సామ



సాయిబాబా గుడి రోడ్డులో పాదయాత్ర చేస్తున్న సామ రంగారెడ్డి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని సాయిబాబా గుడి ప్రధాన రోడ్డు వాణిజ్య ప్రాంతమంటూ విపరీతమైన ట్యాక్స్‌లు వేసి నివాసితులపై అధిక భారం మోపుతున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ధ్వజమెత్తారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా గుడి నుంచి లలితానగర్, శాంతినగర్ కాలనీలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి శనివారం రాత్రి ఆయన పాదయాత్ర చేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. నిత్యం భక్తుల రద్దీ ఉండే సాయిబాబా గుడి పరిసరాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడంలేదని మండిపడ్డారు. డ్రైనేజీ సమస్యపై కార్పొరేటర్ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కింగ్ సదుపాయం లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులిస్తున్నారని, దీంతో వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో జయప్రకాష్, వెంకటేష్‌చారి, ఓంకార్, శ్రీధర్‌రెడ్డి, రత్నం, అనిల్, లక్ష్మీప్రసాద్, రాజేశ్వరి, శివరామ్, దయాకర్ పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దుతా..



ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించి ముగ్గు వేయించిన కార్పొరేటర్ పవన్ కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌ను పరిశుభ్రమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కార్పొరేటర్ పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని సప్తగిరి కాలనీలో శనివారం ఆయన పర్యటించారు. రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాటి పక్కన కొందరు వ్యర్థ పదార్థాలు, చెత్తను వేస్తున్నారని, దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని చెప్పారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ వారిని సంప్రదించి కరెంట్ స్తంభాలను తొలగింపజేసి ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించారు. ఆ స్థలంలో చెత్త వేయకుండా మొక్కలు నాటిస్తానని, క్లీన్ అండ్ గ్రీన్ గా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు యు. రామకృష్ణ, కొత్త తిరుమల, గట్టు మహేష్, వెంకట్ రెడ్డి, రాయిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పేరుతో ప్రభుత్వం మోసం: బీజేపీ



ధర్నాకు వెళ్తున్న లచ్చిరెడ్డి తదితరులు



ఇందిరా పార్క్ వద్ద ధర్నాలో పాల్గొన్న నర్సింహారెడ్డి

ఎల్‌బీనగర్: రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేస్తోందని ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల బీజేపీ నాయకులు విమర్శించారు. అర్హులైన పేదలందరికీ రెండు పడకల ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారం చేపట్టి 8 ఏళ్లు కావస్తున్నా.. తన వాగ్దానాన్ని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. 'డబుల్' ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇందిరా పార్కులో శనివారం చేపట్టిన మహాధర్నాకు ఆ పార్టీ బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అలాగే, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి (బీఎన్‌రెడ్డినగర్), కొప్పుల నర్సింహారెడ్డి (మన్సూరాబాద్), ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి (గడ్డిఅన్నారం), రంగా నర్సింహగుప్తా (చైతన్యపురి), చింతల అరుణ సురేంద్రయాదవ్ (నాగోలు), వెంకటేశ్వర్‌రెడ్డి (వనస్థలిపురం), కళ్లెం నవజీవన్‌రెడ్డి (హయత్‌నగర్), వంగ మధుసూదన్ రెడ్డి (చంపాపేట), పవన్‌కుమార్ (కొత్తపేట), ఐఎస్‌సదన్ డివిజన్ల కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి (సైదాబాద్), జంగం శ్వేతామధుకర్‌రెడ్డి (ఐఎస్‌సదన్), బొక్క భాగ్యలక్ష్మి (మూసారంబాగ్) తమ తమ డివిజన్ల నుంచి భారీ స్థాయిలో కార్యకర్తలతో ధర్నాకు తరలివెళ్లారు. శంకేశ్వరబజార్ బస్తీ, పిల్లిగుడిసెల ప్రాంతాల నుంచి పలువురు డబుల్ ఇళ్ల లబ్ధిదారులను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ ధర్నా చౌక్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, ఐఎస్‌సదన్, మూసారంబాగ్ డివిజన్లలో సర్వే చేసి సేకరించిన లబ్ధిదారుల వివరాలను కార్పొరేటర్లు శేతామధుకర్‌రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ప్రధానకార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌర దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దరఖాస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



సైదాబాద్ నుంచి డబుల్ ఇళ్ల లబ్ధిదారులను ధర్నాకు తీసుకెళ్తున్న లింగాల హరిగౌడ్



లబ్ధిదారుల వివరాలు కిషన్‌రెడ్డికి అందజేస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి